క్లుప్తంగా

బస్‌పాస్‌ల అందజేత



బస్‌పాసులు అందజేస్తున్న ముజాఫర్‌హుస్సేన్

ధారూరు: మండల కేంద్రంలోని వికలాంగులకు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముజాఫర్‌హుస్సేన్ సొంత డబ్బులు వెచ్చించి శనివారం వికలాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. ఉచితంగా బస్‌పాస్‌లు అందుకున్న వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ హెచ్‌వైడీ డిపోకు చెందిన క్రిష్ణ, కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, బుజ్జయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రావల్‌పల్లి ఏపీజీవీబీ మేనేజర్ మనోజ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని చల్లాపూర్, దేవర్‌ఫసల్‌వాద్ గ్రామాల్లో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనకు బ్యాంకులు అనేక రకాల రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్, నర్సింలు తదితరులున్నారు.

ఉత్తమ సేంద్రియ రైతుగా శివరామకృష్ణ




అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ

దోమ: వ్యవసాయ రంగంలో రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలను గుర్తించి ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ వార్షిక అవార్డులు ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కమ్మరి బ్రహ్మయ్య కుమారుడు శివరామకృష్ణకు అవార్డు దక్కింది. శివరామకృష్ణ అగ్రికల్చర్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసి దీర్ఘాయుష్ ఫౌండేషన్ సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా ఆయా గ్రామాల రైతులకు సేంద్రీయ వ్యవసాయ విధానాలు, పంచగవ్య ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయన కృషిని గుర్తించి ఏరువాక ఫౌండేషన్ సంస్థ సభ్యులు రామకృష్ణకు ఉత్తమ సేంద్రియ రైతు అవార్డును అందజేసింది. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. మున్ముందు రైతులకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు కల్పించి రైతులను లాభాల బాటలో నడిచేలా కృషి చేయాలని ఆయనకు సూచించారు.

'సీఐఆర్ యాప్'తో ఫోన్ గుర్తింపు

కొడంగల్ రూరల్ : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందించాలని ఎస్‌ఐ భరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కురువ నరేష్ 5నెలల క్రితం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అప్పట్లోనే బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ సీఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌ను కర్ణాటకలోని ముదోళ్ పరిధిలోని పాకాల గ్రామంలో ఉందని గుర్తించారు. ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కురువ నరేష్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణించే క్రమంలో బస్టాండు ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వల్ల సీఐఆర్ యాప్ ద్వారా తిరిగి ఫోన్ పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

బాలుడికి కుక్క కాటు



గాయపడిన బాలుడు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని అత్వెల్లి గ్రామంలో శనివారం వీధి కుక్క ఓ బాలుడిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. దీంతో బాలుడిని వెంటనే తల్లిదండ్రులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్ వేయించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వీధికుక్కలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

జొన్న.. సన్నగిల్లె!

జొన్న పంట సాగు గణనీయంగా తగ్గింది.. గతంలో వేల ఎకరాల్లో సాగు చేసే రైతులు ప్రస్తుతం అనాసక్తి చూపుతున్నారు.. జొన్న రొట్టెలు తినడం వల్ల ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సైతం చెబుతున్నారు.. రానురాను సంప్రదాయ పంటలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు..

- జొన్న సాగుపై అన్నదాతల అనాసక్తి
- గతంలో 2 వేల ఎకరాల్లో పంట విస్తీర్ణం
- ఈ రబీలో కేవలం 386 ఎకరాల్లోనే..
- వాణిజ్య పంటలవైపు రైతుల చూపు
- భారీగా పెరుగుతున్న ధరలు



నీళ్లపల్లి వద్ద సాగు చేస్తున్న జొన్నపంట

బషీరాబాద్: జొన్న సాగు విస్తీర్ణం ఏడాదికేడాది గణనీయంగా తగ్గుతోంది. గతంలో వేల ఎకరాల్లో సాగయ్యే పంట నేడు వందల ఎకరాల్లోనే సాగుచేస్తున్నారు. అన్నదాతలు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటలైన కంది, పత్తి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో జొన్నపంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుంది. దీంతో మున్ముందు సంప్రదాయ జొన్న పంట సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. బషీరాబాద్ మండలంలో సుమారు 10 వేల హెక్టార్ల సాగుభూములు ఉన్నాయి. రైతులు ఖరీఫ్‌లో వాణిజ్య పంటలైన కంది, పత్తి పంటలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. దీంతో పాటు పెసరు, మినుము వంటి పంటలను అంతర పంటలుగా వేస్తున్నారు. రబీలో పంటలు అంటేనే తెల్ల జొన్న, శనగ పంటలు పండిస్తారు. మండలంలోని మంతట్టి, రెడ్డిఘనాపూర్, నవల్గా, పర్వత్‌పల్లి, మర్పల్లి, జీవన్గీ, గంగ్వార్, క్యాద్గీరా, ఇందర్‌చెడ్ గ్రామాల్లో రైతులు ఎక్కువగా జొన్నపంట సాగుచేసేవారు. కానీ ఏడాదికేడాది జొన్నసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతుంది. గతంలో ఏ గ్రామంలో.. ఏ ఇంటిలో చూసిన రొట్టెలు చేసే శబ్దం వినిపించేది. అంతగా జొన్న రొట్టెలు గ్రామాల్లో తినేవారు. రైతులు సాగు తగ్గించడంతో జొన్నల ధరలు కూడా అమాంతం పెరగడంతో జొన్నరొట్టెలు సామాన్యులకు దొరకని పరిస్థితి నెలకొంది. బషీరాబాద్ మండలంలో గతంలో రెండు వేల ఎకరాల్లో జొన్న పంట సాగుచేస్తే ఈ ఏడాది 386 ఎకరాల్లోనే సాగు చేశారు. దీన్ని బట్టి జొన్నసాగు ఎంతగా పడిపోయిందో అర్థమవుతుంది.

వాణిజ్య పంటలకే మొగ్గు



గతంలో రబీ సీజన్‌లో ఎక్కువగా జొన్న సాగుకు రైతులు మొగ్గు చూపేవారు. కానీ గత నాలుగైదేళ్లుగా రైతులు ఎక్కువగా వాణిజ్య పంటల సాగుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో జొన్నపంట సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. కానీ, మార్కెట్‌లో జొన్న రొట్టెలకు బాగా డిమాండ్ ఉంది. వైద్యులు సైతం జొన్న రొట్టెలు తినాలని సూచిస్తున్నారు. మార్కెట్‌లో ధరలు కూడా బాగానే ఉన్నాయి.

– సూర్యప్రకాశ్, ఏఓ, బషీరాబాద్

సమాచారం ఇవ్వలేదు

- అందుకే సమావేశాన్ని బహిష్కరించాం
- సర్పంచు, ఎంపీటీసీల ఆవేదన



మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీలు

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సన్మానం చేసే విషయమై తమకు ఎంపీపీ, ఎంపీడీఓలు సమాచారం ఇవ్వలేదని ఎంపీటీసీ, సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కొందరు సర్పంచు, ఎంపీటీసీలు మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ...తాండూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సన్మానం చేసే విషయమై తమకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఎమ్మెల్యే అంటే గౌరవం అని...కానీ కొందరు ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సమయం ఇస్తే వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలతో పెద్ద ఎత్తున సన్మానం చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచులు రాజప్పగౌడ్, రాములు, మదన్‌మోహన్ ,సాయిలు, నాగప్ప, ఎంపీటీసీ నరేందర్ రెడ్డి, వసంత్‌కుమార్, శాంతు నాయకులు వెంకటయ్య, శంషోద్దీన్ ,శేఖర్‌రెడ్డి ,వీరేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, జగదీష్‌లు ఉన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలో జరిగిన ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మధుసూదన్, జాయింట్ సెక్రటరీగా జగదీశ్, అనిల్, ఉపాధ్యక్షుడిగా గోపిచంద్, శివప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కార్తీక్, సంజీవ్, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ మాట్లాడుతూ.. ఏబీవీపీ ఎల్లప్పుడూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అలాగే విద్యార్థుల్లో దేశ భక్తి భావాలను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేష్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణమే నిధులను మంజూరు చేయిస్తానన్నారు. రాబోయే రోజుల్లో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వచ్చిన రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలు సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్, సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, ప్రధాన కార్యదర్శి కంల్యానాయక్, జీహెచ్ఎంలు గోపాల్, హరిలాల్, శంకర్ లాల్య పాల్గొన్నారు.

ప్రజల సహకారం తప్పనిసరి

డీఎస్పీ నర్సింహులు



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ తదితరులు

అనంతగిరి: శాంతి భద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలను నిర్ణీత వేగంతో నడిపించాలని, అతివేగంతో నడిపి ప్రమాదాలబారిన పడొద్దన్నారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వాహనాల చలాన్‌లను కట్టాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎంతో లాభాలున్నాయన్నారు. సరైన పత్రాలు లేని 44 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ సీఐ టి.శ్రీనుతో పాటు పలువురు సీఐలు, 7గురు ఎస్ఐలు, 5మంది ఏఎస్ఐలు, 70మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

ముఖ్యపాత్ర పోషించాలి: ఎస్పీ

జిల్లాలో నేరాలు తగ్గుట, నేరాలను వెంటనే ఛేదించడంలో సెంట్రల్ క్రైం స్టేషన్ అధికారులు ముఖ్యపాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. శనివారం ఎస్పీ తన కార్యాలయంలో సీసీఎస్ పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరిగే నేరాలపై అవగాహన ఉండాలన్నారు. పదేపదే నేరాలకు పాల్పడే నేరస్తులపైన కేసులు నమోదు చేసి వారికి కౌన్సిలింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య, బాలస్వామి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం

తహసీల్దార్ గణేశ్

మర్పల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని మర్పల్లి తహసీల్దార్ గణేశ్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శని, ఆదివారం బూత్ లెవల్ అధికారులు ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మర్పల్లి, బూచన్‌పల్లి, దామస్తాపూర్, కల్‌ఖోడ గ్రా మాల్లో ఓటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నా రు. అందుకు ఆయా గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తు ఫారం అందజేయాలన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

కొడంగల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం తహసీల్దార్ విజయకుమార్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం రెండు రోజుల పాటు ఓటరు జాబితా సవరణకు అవకాశం ఇచ్చింది. కావునా శని, ఆదివారాల్లో అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటర్లకు సంబంధించి పేరులో తప్పులు ఉన్నా, అడ్రస్ మార్చినా సంబంధిత బీఎల్ఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు

తాండూరు: నియోజకవర్గంలో ఉన్న 269 పోలింగ్ బూత్‌ల్లో ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు కొత్త ఓటరుగా నమోదు చేసుకొనేందుకు ఫారం -6 దరఖాస్తులు 281 అందుబాటులో ఉన్నాయి. ఫారం 7, ఫారం-8 దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచడం జరిగిందని ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతి, యువకులు ఓటు హక్కు పొందేందుకు ఫారం -6 దరఖాస్తు చేయాలన్నారు. పోలింగ్ బూత్‌ల్లో బీఎల్ఓలు ఆదివారం సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



మర్పల్లి: ఫారం నంబర్-6ను స్వీకరిస్తున్న తహసీల్దార్ గణేశ్

రామనామంతో మార్మోగిన వీధులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు ఎన్‌టీఆర్, బీజేఆర్, మహాశక్తి , ఎంఆర్‌పీ చౌరస్తాలు శనివారం జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. సోమవారం జరగనున్న అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని వికారాబాద్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామహారం (మానవహారం) పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆయా పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కాషాయ జెండాలతో వారి వారి విద్యాసంస్థల నుంచి నగర ప్రధాన రోడ్లపైకి ర్యాలీగా వచ్చి రోడ్డుకు ఇరువైపులా ఎన్‌టీఆర్ చౌరాస్తా నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు విద్యార్థులు నిలబడి పెద్ద ఎత్తున మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్లన్నీ శ్రీరామ నామంతో మార్మోగాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాజు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, నాగయ్య, జయదేవ్, వెంకట్‌రెడ్డి, బస్వరాజు, వేణుగోపాల్, చంద్రశేఖర్, తిరమలేశ్, ఆధ్యాత్మిక సేవా మండలి ప్రతినిధులు టి.రాజు, వెంకట్, సుభాష్ పంతులు, సాయిచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జై శ్రీరామ్ జెండా

బొంరాస్‌పేట: అయోధ్యలో శ్రీరాంలాలా ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సవాలు జరుపుటకు సిద్ధమయ్యారు. శనివారం మండల పరిధిలోని రేగడిమైలారంలో ఇంటింటిపై జైశ్రీరామ్ జెండాల అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హిందూవాహిని ఆధ్వర్యంలో యువకులు, చిన్నారులు గ్రామంలో జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ ప్రచారం నిర్వహించారు. రామనామాన్ని స్మరిస్తూ ప్రత్యేక పూజలు చేయాలన్నారు.

రాములోరి పూజిత అక్షితల పంపిణీ

కొడంగల్ రూరల్ : అయోధ్య శ్రీరామజన్మభూమి పూజిత అక్షితలను శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో రామదండు సభ్యులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. కాలనీల్లోని దేవాలయాలలో పూజిత అక్షితల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామ నామ స్మరణతో భజనలు చేస్తూ ఊరేగింపుగా ఇంటింటికీ తిరుగుతూ అక్షితలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామదండు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విద్యార్థుల శ్రీరామహారం (మానవహారం)



బాలాజీనగర్‌లో భజనలు చేస్తూ రామదండు కార్యకర్తల ఊరేగింపు



సన్‌సిటీ కాలనీలో పూజిత అక్షితలను పంపిణీ చేసేందుకు వెళ్తున్న కార్యకర్తలు

ధారూరు మార్కెట్‌కు 943 బస్తాల కందులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 943 బస్తాల కందులు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ. 9,700 నుంచి రూ. 9,930 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె పేర్కొన్నారు. సన్నరకం వడ్లు, వేరుశనగ, మొక్కజొన్న ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చాయని తెలిపారు. వడ్లు సన్నరకం క్వింటాల్‌కు రూ. 2,900, వేరుశనగ క్వింటాల్‌కు రూ.7,200 నుంచి రూ. 7,450 వరకు, అలాగే మొక్కజొన్న క్వింటాల్‌కు రూ. 2,200 నుంచి రూ. 2,250 వరకు మార్కెట్లో ధర పలికిందని వివరించారు.

టాలెంట్ టెస్టులతో ఉపయోగం

మండల విద్యాధికారి హరిశ్చందర్



ఫలితాలు విడుదల చేస్తున్న ఎంఈఓ

పరిగి: టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడుతాయని మండల విద్యాధికారి హరిశ్చందర్ నాయక్ అన్నారు. ఇటీవల పట్టణ కేంద్రంలో సాఫ్ట్‌లైన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించగా శనివారం ఎంఈఓ ఫలితాలను విడుదల చేశారు. ఈ టెస్ట్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు 900 మంది హాజరు కాగా ప్రతిభ కనబర్చిన ఆరుగురి విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచితంగా కంప్యూటర్లను త్వరలోనే అందజేయనున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పట్టణ కేంద్రంలోని గాన్సోలా స్కూల్ విద్యార్థిని వల్లభ, టీఎస్ఎంఎస్ పూడూరు విద్యార్థిని లావణ్య, భార్గవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి శ్రీసాయి, వెంకటేశ్వర్లు టెస్టులో ప్రతిభ కనబర్చి బహుమతులకు ఎంపికయ్యారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొనడంతో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. బయట సమాజంపై అవగాహన పెరుగుతుందని ప్రతి ఒక్కరూ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంజనేయులు, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్రమశిక్షణతో పెంచాలి

ప్రధానోపాధ్యాయులు రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రాములు

దోమ : పిల్లలను తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాములు అన్నారు. శనివారం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. అప్పుడే ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విద్యార్థులకు అర్థమవుతాయని అన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెను ప్రకారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో పాఠశాల చైర్మన్ ఎన్నికలకు నోటిఫికేషన్లు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జ్యోతి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



నోటీస్ బోర్డుపై నోటిఫికేషన్ వెలువరించిన ఎంఈఓ

కుల్కచర్ల: పాఠశాల విద్యాకమిటీల ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ విడుదలైంది. కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రాథమిక, ప్రాథకోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీలకు ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు ఎన్నిక ప్రక్రియను దగ్గర నుంచి తెలుసుకోవచ్చన్నారు. 29న సభ్యులు, చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాఘవేందర్, పీడీ ఖాజ, సీఆర్పీ గాంగ్యనాయక్ పాల్గొన్నారు.

29న ఎస్‌ఎంసీ ఎన్నికలు

బంట్వారం: ఈ నెల 29న బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ల ఎన్నికలు నిర్వహిస్తామని ఎంఈఓ చంద్రప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ప్రభుత్వం నుంచి విడుదల చేసింది. శనివారం ప్రతి పాఠశాలకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. అలాగే నోటీసు బోర్డుపై తల్లిదండ్రుల జాబితాను ప్రకటించామన్నారు. ఈ జాబితాపై 22, 23 తేదీ వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు. ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక కోసం 24వ, తేదీన తల్లిదండ్రుల తుది జాబితాను ఖరారు చేస్తామన్నారు. 29వ, తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1.30లకు ఎస్ఎంసీ చైర్మన్ ,వైస్ చైర్మన్ల ఎన్నిక ఉంటుందని వివరించారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై అవగాహన

తాండూరు టౌన్ : ఈ నెల 29న ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని పట్టణ మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ అన్నారు. శనివారం ఆమె గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ ఎన్నికల ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పించారు. ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యుల ఎన్నికల విధానంపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల చదువులు, బోధనపై, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలలో ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. మీ పిల్లల భవిష్యత్ కోసం ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయురాలు రాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.